సాక్షి
నల్లగొండ
గురువారం ♦ 13 ♦ ఏప్రిల్ ♦ 2023



బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. - 8లో



యాదాద్రి క్షేత్రానికి భద్రత ఏదీ..

యాదాద్రి ప్రధానాలయం ఉద్ఘాటన జరిగిన ఏడాది గడిచినా పూర్తిస్థాయి భద్రత కనిపించడం లేదు. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41°/24°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-38 (గురువారం సాయంత్రం)

సహర్ 4-37 (శుక్రవారం ఉదయం)

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

నల్లగొండ టౌన్ : జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రైతుబంధు పథకం నిధులను రూ.39 కోట్లు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రికి జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో 10 ఎకరాల నుంచి 25ఎకరాల్లోపు ఉన్న 7,573 మంది రైతులకు సంబంధించిన రైతుబంధు డబ్బులను ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిందని తెలిపారు. ఇందుకు సహకరించిన జిల్లా మంత్రి జగదీశ్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

శిక్షణ శిబిరాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ టూటౌన్ : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఆదేశాల మేరకు జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే ఒకటి నుంచి 31వ తేదీ వరకు గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు క్రీడాంశం, ప్రదేశం, గ్రామం, క్రీడ, మొబైల్ నంబర్ తదితర వివరాలతో ఈనెల 21లోగా కలెక్టరేట్ వెనుక భాగంలోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. శిక్షణ శిబిరంలో 12 నుంచి 14 సంవత్సరాలలోపు బాల, బాలికలకు వివిధ క్రీడలు నేర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ శిబిరం నిర్వహించిన వారికి రూ.4 వేల గౌరవ వేతనం, క్రీడా సామగ్రి ఇస్తామని తెలిపారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు.

14 నుంచి జార్జిరెడ్డి వర్ధంతి సభలు

నల్లగొండ టౌన్ : పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు జార్జిరెడ్డి 51వ వర్ధంతి సభలను రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బొలుగూరి కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో జరిగిన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో మొదటి గోల్డ్‌మెడలిస్ట్ అయిన జార్జిరెడ్డి ఆనాడు యూనివర్సిటీలో నెలకొన్న హిందూ మతోన్మాద మూకలను ఎదిరించి.. అరాచక శక్తుల ఆట కట్టించడానికి పీడీఎస్‌యూను ఏర్పాటు చేశారని చెప్పారు. ఆయన ఆశయాల కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హర్షిం శ్రీనివాస్, సహాయ కార్యదర్శి అనిల్‌కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు, ఎస్.బాలరాజు, రాజేశ్, సైదులు, నవీన్‌కుమార్, సతీష్ పాల్గొన్నారు.

అవినీతికి కేరాఫ్ కల్వకుంట్ల కుటుంబం



మాట్లాడుతున్న కంకణాల శ్రీధర్‌రెడ్డి

మాడుగులపల్లి : లిక్కర్ స్కాం, కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు, ధరణిలో లొసుగులను అడ్డుపెట్టుకొని సీఎం కేసీఆర్ కుటుంబం రూ.లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టి అవినీతికి కేరాఫ్‌గా నిలిచిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మాడుగులపల్లి మండలంలోని గార్లకుంటపాలెంలో కన్వెనర్ మాజీ ఎంపీటీసీ నర్సింహగౌడ్ స్వగృహంలో శ్రీధర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ వనరులను దోచుకొని అప్పుల రాష్ట్రంగా మార్చిన కేసీఆర్ దేశాన్ని ఎలా ఉద్ధరిస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీజేపీ ఘన విజయం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. అంతకు ముందు పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై బూత్ కమిటీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ రత్నమాల, పలు గ్రామాల బీజేపీ బూత్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీలగిరికి కొత్త రూపు





డివైడర్ల మధ్యలో పచ్చని మొక్కలతో సిద్ధమైన పట్టణంలోని హైదరాబాద్ రహదారి, ఎన్జీ కళాశాల ఎదురుగా బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జంక్షన్

విశాలమైన రోడ్లు.. ఆకర్షించేలా జంక్షన్లు

- పట్టణంలో 90 శాతం పూర్తికావొచ్చిన అభివృద్ధి పనులు
- మే మొదటి వారంలో మంత్రి కేటీఆర్ చేత ప్రారంభోత్సవానికి సన్నాహాలు
- అదేరోజున నీలగిరి కళాభారతి, మినీ ట్యాంక్‌బండ్ తదితర నిర్మాణాలకు శంకుస్థాపన
- స్థానిక అధికారులకు దిశానిర్దేశం చేసిన మున్సిపల్ శాఖ

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణం కొత్తరూపు సంతరించుకుంటోంది. నల్లగొండ పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటికే 90 శాతం వరకు పూర్తయ్యాయి. కాగా మిగిలిన పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయించి మే మొదటి వారంలోగా మంత్రి కేటీఆర్‌తో ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. అదే రోజున మరికొన్ని అభివృద్ధి పనులకు మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించేలా సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక అధికారులతో పురపాలక శాఖ ఉన్నతాధికారులు సైతం సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

త్వరలో జిల్లా కేంద్రానికి మంత్రి కేటీఆర్..

నీలగిరిలో చేపడుతున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ త్వరలో జిల్లా కేంద్రానికి రానున్నారు. పట్టణంలో చేపడుతున్న సుందరీకరణ, మర్రిగూడ బైపాస్ రోడ్ నుంచి పెద్ద గడియారం సెంటర్ వరకు రహదారి విస్తరణ పనులు పూర్తి కావొస్తున్నాయి. ఇప్పటికే పూర్తి అయిన చర్లపల్లిలోని అర్బన్ పార్కు, బస్టాండ్ సమీపంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం, డీవీకే రోడ్డులోని రైతు బజారు, ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్మించిన నిరాశ్రయుల అర్బన్ హోం షెల్టర్లను కూడా ప్రారంభించనున్నారు. అదే విధంగా నీలగిరి పట్టణం నడిబొడ్డున నిర్మించనున్న నీలగిరి కళాభారతి, పానగల్ ఉదయ సముద్రం మినీ ట్యాంక్‌బండ్‌గా నిర్మాణం కోసం అదే రోజు మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించే ఆలోచనలో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఉన్నారు. ఇప్పటికే నీలగిరి కళాభారతి, ఉదయ సముద్రం బండ్ నిర్మాణాలకు సంబంధించిన నమూనాలను కన్సల్టీ సంస్థలు సిద్ధం చేశాయి. మర్రిగూడ బైపాస్ నుంచి గడియారం సెంటర్ వరకు ఆరు వరుసల రోడ్డు విస్తరణ చేపట్టడంతో రహదారి విశాలంగా మారింది. అదే విధంగా రోడ్డు మధ్యలో డివైడర్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, పచ్చదనాన్ని ఇచ్చేందుకు మొక్కలు నాటారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో రాత్రి పూట నీలగిరి పట్టణం జిగేల్‌మని మెరుస్తోంది. వీటితో పాటు రహదారికి ఇరు వైపుల డ్రైయినేజీ నిర్మాణంతో పాటు దాని పైనే ఫుట్‌పాత్ కూడా ఏర్పాటు చేశారు. హైదరాబాద్ రోడ్డులో అక్కడక్కడ డ్రైయినేజీ కాల్వల నిర్మాణం, కొంత రహదారి పనులు మిగిలి ఉండడంతో పనుల్లో స్పీడ్ పెంచారు.



ప్రారంభానికి సిద్ధమైన అర్బన్ హోం షెల్టర్

అట్టహాసంగా కార్యక్రమాలు..

పట్టణంలో ఇప్పటికే పూర్తయిన పనులను ప్రారంభించడంతో పాటు కొత్త వాటికి కూడా మంత్రి కేటీఆర్‌తో శంకుస్థాపన చేయించనున్నారు. రూ.228.50 కోట్లతో నీలగిరి కళాభారతి, ఉదయ సముద్రం బండ్ నిర్మాణం చేపట్టనున్నారు. అదే విధంగా మర్రిగూడ బైపాస్‌లో రూ.45 కోట్లతో నిర్మించనున్న ఫ్లైఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన చేయించాలని నిర్ణయించారు. ఒకవైపు పూర్తయిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, మరోవైపు కొత్త పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు పెద్ద ఎత్తున అట్టహాసంగా చేపట్టాలని ఎమ్మెల్యే కంచర్ల భావిస్తున్నారు.

కేజీబీవీల్లో ‘రీడింగ్ చాలెంజ్’

- విద్యా సామర్థ్యాల పెంపే లక్ష్యంగా అడుగులు
- మెరుగుపడుతున్న విద్యార్థుల చదువు



రీడింగ్ చాలెంజ్ కార్యక్రమంలో విద్యార్థినులు

పెద్దవూర : కరోనా ప్రభావంతో తగ్గిపోయిన విద్యార్థుల విద్యా సామర్థ్యాలను క్రమంగా గాడిలో పెట్టేందుకు ప్రాథమిక పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఇదే తరహాలో గత యేడాది నుంచి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) ‘రీడింగ్ చాలెంజ్’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మూడు నెలల నుంచి ప్రత్యక్ష బోధన కొనసాగుతుంది. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఈ రీడింగ్ చాలెంజ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

రీడింగ్ చాలెంజ్ ఇలా..

జిల్లాలో మొత్తం కేజీబీవీలు	27
6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థినులు	4,350

రోజూ తెలుగు పీరియడ్‌లో 10 నుంచి 15 నిమిషాల సమయాన్ని విద్యార్థినుల చదువుకోసం కేటాయిస్తున్నారు. చదువుకునే ఆడియోను సెల్‌ఫోన్‌లో రికార్డు చేస్తున్నారు. వాటిని ఖాళీ సమయాల్లో పరిశీలించి తొలి మూడు స్థానాల్లో నిలిచిన ఉత్తమ ప్రతిభావంతులను ఎంపిక చేస్తున్నారు. తర్వాత రోజు తరగతి గదిలో అందరి ముందు వారిని ప్రశంసిస్తున్నారు. ప్రతిభ ఆధారంగా ధారాళంగా, నెమ్మదిగా చదివే వారిని గుర్తించి మూడు గ్రూపులుగా విభజిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ వహించి చదువులో మెళకువలను నేర్పిస్తున్నారు. విద్యార్థినుల లోటుపాట్లను సవరిస్తూ, ప్రత్యేక డైరీని సైతం నిర్వహిస్తున్నారు.

విద్యార్థినులలో పెరుగుతున్న అవగాహన

కేజీబీవీల్లో అమలు చేస్తున్న రీడింగ్ చాలెంజ్ కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో విద్యా సామర్థ్యాలు పెరగడంతో పాటు చదువుపై ఆసక్తి పెరుగుతోంది. రోజూ తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో నిర్ణయించిన పాఠ్యాంశాన్ని చదివిస్తూ లక్ష్యాన్ని చేరుతున్నారు. ఉపాధ్యాయులు బోధించిన తర్వాత ఎక్కువసార్లు చదవడం, వినడంతో బాగా గుర్తుంటున్నాయని విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేర్చుకోవాలనే ఆసక్తి పెరిగింది



రీడింగ్ చాలెంజ్‌ను ప్రతిరోజు అమలు చేస్తుండడంతో నాకు నేర్చుకోవాలనే ఆసక్తి పెరిగింది. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ బాగా చదవగలుగుతున్నా. కరోనా కాలంలో ప్రత్యక్షంగా తరగతులు లేకపోవడంతో మర్చిపోయాను. గ్రూపులుగా విభజించి చదివించడంతో పాటు రాయిస్తుండటంతో మా అందరిలో ఆత్మ విశ్వాసం పెరిగింది. బాగా చదివిన వారిని అందరిముందు ప్రశంసిస్తుండడంతో చదవాలనే కసి పెరిగింది.

– రమావత్ అఖిల, తొమ్మిదో తరగతి, పెద్దవూర

పకడ్బందీగా అమలు చేస్తున్నాం



పాఠశాల ప్రారంభం నుంచి రీడింగ్ చాలెంజ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. సబ్జెక్టుల్లో వెనకబడిన విద్యార్థినులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వారు చదువులో మెరుగు పడేలా చూస్తున్నాం. ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే సంబంధిత సబ్జెక్టు టీచర్‌తో నివృత్తి చేయిస్తున్నాం. విద్యార్థినుల్లో విద్యా సామర్థ్యాలు బాగా మెరుగుపడుతున్నాయి.

– బి.జ్యోత్స్న, ఎస్‌ఓ, కేజీబీవీ, పెద్దవూర

కాంగ్రెస్ గెలిస్తే పోడు భూములకు పరిష్కారం

- డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



బాల్నేపల్లిలోలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

అడవిదేవులపల్లి : తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పోడు భూముల సమస్య పరిష్కారమవుతుందని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర బుధవారం అడవిదేవులపల్లి మండలంలోని బాల్నేపల్లి, చిట్యాల గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు మూడెకరాలు, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి తొమ్మిదేళ్లు అవుతున్నా.. ఇప్పటికు మాట నిలుపుకోలేకపోయారని ధ్వజమెత్తారు. రైతులకు రూ.లక్ష రుణమాఫీ అని చెప్పిన కేసీఆర్ ఏకకాలంలో రుణాలు మాఫీ చేయకపోవడంతో బ్యాంకర్లు రైతులను ముక్కుపిండి అప్పులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేపర్ల లీకులతో విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలపై మోయలేని భారాన్ని మోపి నడ్డి విరిచిందన్నారు. కార్యక్రమంలో మోతీలాల్, దంజానాయక్, కృష్ణ, శ్రీధర్, అంజి, హనుమయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులను ఓటరుగా నమోదు చేస్తాం

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ : ఓటర్ జాబితా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను మరోసారి పరిశీలించి అర్హులు ఉంటే ఓటర్‌గా నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి రవికిరణ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో ఫొటో సిమిలరీ ఎంట్రీ పరిశీలన, బూత్ స్థాయి అధికారుల నియామకం, ఆధార్ నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 1,747 పోలింగ్ కేంద్రాలకు పూర్తిస్థాయిలో బూత్ లెవల్ అధికారులు ఉన్నారని బూత్ లెవెల్ అధికారులు, తహసీల్దార్ల ద్వారా ఓటర్ల జాబితాలో తొలగింపుకు గురైన ఓటర్లను పరిశీలిస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, ఎస్‌డీసీ యూనిట్-2 రోహిత్ సింగ్ ఉన్నారు.

పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండానే


- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



భిక్షానాయక్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండానే అని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో నిర్వహించిన మూడావత్ భిక్షానాయక్ 44వ వర్ధంతి సభలో ఆయన పాల్గొన్నారు. ముందుగా భిక్షానాయక్ స్థూపం వద్ద పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భిక్షానాయక్ పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అప్పట్లో చింతపల్లి శివారులో పేదల గుడిసెలు తీసేస్తున్నారని సమాచారం అందడంతో దానిని అడ్డుకునేందుకు అక్కడకు వెళ్లిన భిక్షానాయక్‌ను భూస్వామ గుండాలు దారుణంగా హత్య చేశారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు జగదీష్‌చంద్ర, మల్లు గౌతం రెడ్డి, బావండ్ల పాండు, మూడావత్ రవినాయక్, పాదూరి శశిధర్‌రెడ్డి, మంగారెడ్డి, పరశురాములు, రామ్మూర్తి, గోవర్ధని, గాదె పద్మ, రాముునాయక్ తదితరులున్నారు.

యాదాద్రీశుడికి విశేష పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం విశేష పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం, స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన చేపట్టారు. అనంతరం శ్రీస్వామి వారికి బాలభోగం, మూలవర్యులకు నిజాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అలాగే సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చ, ఆలయంలో సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, నిత్య కల్యాణం, తిరువీధి జోడు సేవలను నిర్వహించారు. రాత్రి పవళింపు సేవ చేసి ఆలయాన్ని మూసివేశారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు జనసమీకరణ

- జిల్లా నుంచి 1800 మందిని తరలించాలని నిర్ణయం
- మండల కేంద్రాల నుంచి బస్సులో తీసుకెళ్లి.. తీసుకురానున్న అధికారులు

నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్మించిన భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏప్రిల్ 14న ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి జన సమీకరణ చేస్తున్నారు. అందులో భాగంగా నల్లగొండ జిల్లా నుంచి మొత్తం 1800 మందిని 36 బస్సుల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 300 మందిని 6 బస్సుల్లో తరలించాలని నిర్ణయించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కలెక్టర్‌కు బాధ్యత అప్పగించారు. అయితే జిల్లాలో ఆయా మండలాల వారీగా తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలాల నుంచి జనాన్ని సమీకరించి హైదరాబాద్‌కు పంపించాల్సి ఉంది. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఇప్పటికే సమావేశాలు నిర్వహించి మండలాల వారీగా అధికారులకు బాధ్యతలు అప్పగించారు.

ప్రతి బస్సుకు లైజనింగ్ ఆఫీసర్లు..

ఒక్కో బస్సుకు రెవెన్యూ, గ్రామ పంచాయతీకి చెందిన ఇద్దరు లైజనింగ్ ఆఫీసర్లతో పాటు ఒక కానిస్టేబుల్‌ను నియమిస్తారు. ఈ ముగ్గురి ఆధ్వర్యంలో బస్సులు 14వ తేదీ ఉదయం ఆయా మండల కేంద్రంలో టిఫిన్ చేసుకొని బయల్దేరుతాయి. మధ్యాహ్నం హైదరాబాద్ రింగ్‌రోడ్డు సమీపంలో జంగారెడ్డి, బాల్‌రెడ్డి, కావేరి ఫంక్షన్‌హాళ్లలో మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత ఎల్‌బీనగర్, ఉప్పల్, రైల్ నిలయం నుంచి నక్లెస్‌రోడ్డు చేరుకుంటున్నారు. పీవీగార్డ్ వద్ద బస్సులను పార్కింగ్ చేసి అక్కడి నుంచి కాలినడకన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి వెళ్తారు. కార్యక్రమం ముగిసిన తర్వాత మళ్లీ మధ్యాహ్నం భోజనం చేసిన ఫంక్షన్‌హాల్ వద్ద రాత్రి భోజనం తర్వాత ఆయా మండలాలకు చేరవేయనున్నారు.

న్యాయవాద రక్షణ చట్టం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి

- హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వరరావు




పల్లె నాగేశ్వరరావును సన్మానిస్తున్న స్థానిక బార్ అసోసియేషన్ నాయకులు

హుజూర్‌నగర్: న్యాయవాద రక్షణ చట్టం తేవడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో హుజూర్‌నగర్ బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో పల్లె నాగేశ్వరరావు, సరిత దంపతులను ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు జన్మనిచ్చిన, తాను విద్యనభ్యసించిన ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. త్వరలో సీఎం కేసీఆర్‌ను కలిసి జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.15 వేల ఉపకార వేతనం ఇవ్వాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేస్తామని చెప్పారు. తొలుత పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాముల రామిరెడ్డి, జక్కుల నాగేశ్వరరావు, అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు, ఏజీపీలు ఎ. శ్రీనివాసరెడ్డి, వీజేకే మూర్తి, న్యాయవాదులు రవికుమార్, యాదగిరి, అంజయ్య, రమణారెడ్డి, పి. చంద్రయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

పాతాళంలోకి జలం

- ఒక్క నెలలోనే సగటున 1.64 మీటర్లు పడిపోయిన భూగర్భ జలాలు
- 2022 మార్చిలో 6.43 మీటర్ల వద్ద.. ఇప్పుడు 7.77 మీటర్ల దిగువకు..
- మేలో మరింత తగ్గే అవకాశం



నల్లగొండ : పాతాళ గంగ పడిపోతోంది. గత సంవత్సరం మార్చి నెలతో పోల్చితే 2023 మార్చిలో 1.34 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. ఈ ఏడాది ఫిబ్రవరితో పోల్చితే మార్చిలో నెల రోజుల్లోనే 1.64 మీటర్ల లోతుల్లోకి భూగర్భ జలాలు వెళ్లాయి. ఇందులో కొన్ని మండలాల్లో ఇప్పటికే 12 మీటర్లలోతుకు పడిపోగా.. కొన్ని మండలాల్లో 6, 7 మీటర్ల లోతులో ఉన్నాయి. అత్యధికంగా చండూరు మండలంలో గతేదాది మార్చి కంటే.. ఈ సారి 4.28 మీటర్ల కిందకు నీళ్లు పడిపోయాయి. ప్రస్తుతం మండలంలో 10.51 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయి. మే నెలలో మరింత పడిపోయే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. నీటిని పొదుపుగా వాడుకోకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు.

ఒక్క నెలలోనే గణనీయంగా..

ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలతో పోల్చి చూస్తే జిల్లా వ్యాప్తంగా 1.64 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు తగ్గిపోయాయి. కొన్ని మండలాల్లో అంత కంటే ఎక్కువగా లోతుకు గంగమ్మ వెళ్లినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. చందంపేట మండలంలో 2023 ఫిబ్రవరి నెలలో 8.95 మీటర్ల వద్ద ఉన్న భూగర్భజలాలు 10.88 మీటర్ల లోతుకు పడిపోయాయి. చింతపల్లిలో 6.07 మీటర్ల లోతులో ఉన్న నీరు 7.48 మీటర్లకు తగ్గిపోగా దేవరకొండలో 5.58 మీటర్ల నుంచి 7.06 మీటర్లకు, గుర్రంపోడులో 2.72 మీటర్ల నుంచి 4.43 మీటర్లకు కొండమల్లేపల్లిలో 4.62 నుంచి 5.81 మీటర్లకు, మర్రిగూడ మండలంలో 4.67 నుంచి 8.066 మీటర్లకు, నాంపల్లి మండలంలో 5.79 ఉండగా 9.49కి, నేరడుకొమ్ము లో 9.10 నుంచి 11.78 కి, పీఏపల్లిలో 4.34 నుంచి 5.07కి, అడవిదేవులపల్లిలో 11.79 నుంచి 12.59కి, అనుములలో 5.27 నుంచి 7.49కి, దామరచర్లలో 1.87 నుంచి 3.65కి, మిర్యాలగూడలో 4.51 నుంచి 5,97కు, పెద్దవూరలో 3.73 నుంచి 3.92కు, వేములపల్లిలో 6.64 నుంచి 8.00 మీటర్లకు పడిపోగా చండూర్ మండలంలో 5.99 నుంచి 9.65 మీటర్లకు పడిపోయింది. చిట్యాల మండలంలో 6.08 నుంచి 11.45 మీటర్లకు, కట్టంగూర్‌లో 6.60 నుంచి 8.83కు, కేతేపల్లిలో 8.17 నుంచి 10.22కు, మునుగోడులో 4.78 నుంచి 7.08 కి, నకిరేకల్‌లో 5.56 నుంచి 6.47కు, నార్కట్‌పల్లి, నల్లగొండ, శాలిగౌరారం, తిప్పర్తి, గట్టుప్పల్ మండలాల్లో కూడా మీటర్‌కు పైగానే భూగర్భజలాలు గత నెల కంటే అధికంగా తగ్గాయి.

గతేదాది మార్చితో పోల్చితే భూగర్భ జలాల తగ్గుదల ఇలా..

మండలం	మీటర్లు				
మర్రిగూడ	2.76	మాడ్గులపల్లి	2.29	చిట్యాల	3.52
నాంపల్లి	2.91	మిర్యాలగూడ	3.13	కనగల్	1.11
నేరడుగొమ్ము	2.47	నిడమనూరు	1.40	కట్టంగూర్	1.20
అడవిదేవులపల్లి	0.98	పెద్దవూర	0.54	మునుగోడు	3.12
అనుముల	1.61	త్రిపురారం	2.71	నార్కట్‌పల్లి	1.33
దామరచర్ల	2.82	వేములపల్లి	2.88	నల్లగొండ	1.11
		చండూరు	4.28	తిప్పర్తి	1.93

పొదుపుగా వాడుకోవాలి

భూగర్భజలాలు భారీ ఎత్తున తగ్గిపోతున్నాయి. ఒక్క నెలలోనే కొన్ని మండలాల్లో 3 నుంచి 4 మీటర్ల కిందికి వెళ్లగా మరికొన్ని మండలాల్లో మీటర్‌కు పైగానే తగ్గిపోయాయి. అవసరాన్ని బట్టి నీటిని పొదుపుగా వాడుకోవాల్సి ఉంది. ప్రస్తుతం వరి కోతలు కూడా పూర్తవుతున్నందున కొన్ని మండలాల్లో భూగర్భజలాలు తగ్గకపోయినా, కొన్ని ప్రాంతాల్లో భారీ ఎత్తున తగ్గే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

దాడి కేసులో నిందితుడి రిమాండ్

పాలకవీడు: మండల పరిధి మహంకాళిగూడెం గ్రామ పంచాయతీ భవానీపురంలోని డెక్కన్ సిమెంట్ పరిశ్రమలోని సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రావిపహాడ్ గ్రామానికి చెందిన చిమట వెంకన్న తన ట్రాక్టర్‌తో అక్రమంగా సిమెంట్ పరిశ్రమ బౌండరీ గోడ కూల్చివేశాడు. అడ్డుకున్న పరిశ్రమ సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేయడంతో వారికి గాయాలయ్యాయి. ఈ మేరకు పరిశ్రమ సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ నవిలె గోపీకుమార్ ఫిర్యాదు మేరకు వెంకన్నను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సైదులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


రాములు (ఫైల్)

మోటకొండూర్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని తేర్యాల గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోటకొండూర్ మండలం తేర్యాల గ్రామానికి చెందిన ఇంద్రాల రాములు(53) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాములు మంగళవారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్ద కల్లు తేవటానికి వెళ్తున్నానని భార్యకు చెప్పి బయలుదేరాడు. రాత్రి అవుతున్నా రాములు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ లభించలేదు. ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా బురద మడిలో విగతజీవుడిగా కనిపించాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఐలమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాగి మధుసూదన్ తెలిపారు.

బీరులో నాచు

మోత్కూరు : మద్యం వినియోగదారుడు బీరు కొనుగోలు చేయగా అందులో నాచు వచ్చింది. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఓ వైన్స్‌లో బుధవారం ఆరెగూడెం గ్రామానికి చెందిన శ్యామల నర్సిరెడ్డి ఓ కంపెనీకి చెందిన రెండు బీర్లను రూ.300లకు కొనుగోలు చేశారు. మూత తీసి తాగడానికి ప్రయత్నించగా అందులోని ఓ బీరులో నాచు, చెత్త కనిపించాయి. మరో బీరులో కూడా అలానే ఉండడంతో సీలు తీయని బీరు సీసాను తీసుకొచ్చి మద్యం దుకాణం నిర్వాహకుడికి చూపించారు. దీంతో సీల్ తీయని బీరు తీసుకొని మరో బీరు ఇచ్చాడు.

పాము కాటుతో గేదె మృతి

గుండాల : పాము కాటుతో గేదె మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని వస్తాకొండూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన తాటిపల్లి రజిత ఇటీవల మహిళా సంఘంలో రుణం పొంది గేదెను కొనుగోలు చేసింది. బుధవారం వ్యవసాయ బావి వద్ద గేదె మేస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన ఆమె గుండాల పశువుల డాక్టర్‌కు సమాచారం ఇచ్చినప్పటికీ చికిత్స అందించే క్రమంలోనే మృతిచెందినట్లు వాపోయింది.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- గులాబీ జెండా అందరికీ అండ
- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట : బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణలో అమలు చేస్తోందని పేర్కొన్నారు . బుధవారం సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని కుడకుడ, కోమటికుంటకు చెందిన 100మంది యువకులు కాంగ్రెస్, బీజేపీలను వీడి మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను రెండు కళ్లలా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని మరింతగా బలోపేతం చేయడానికి యువత స్వచ్ఛందంగా ముందుకు రావడం శుభ పరిణామం అన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. గ్రామాలు, పణాలలో ప్రజల సమస్యలు పరిష్కారానికి, పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. గతంతో పోలిస్తే గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి కండ్లముందే కనిపిస్తున్నదన్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి చూసి ఓర్వలేక బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రతి కార్యకర్త తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గుర్రం సత్యనారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్ సైదులు, మాజీ మార్కెట్ డైరెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

చివ్వెంల(సూర్యాపేట) : రోడ్డు పక్కన గుడిసెలో నివసిస్తున్నపేదలకు వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామంలో ఇఫ్తార్ విందుకు హాజరైన ఆయన రోడ్డు పక్కన పూరి గుడిసెల్లో ఉంటున్న నిరుపేదలకు చూసి చలించి పోయారు. వెంటనే కాన్వాయ్ దిగి వారి వద్దకు వెళ్లి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వారు ఇల్లు నిర్మించుకోవడానికి రూ.3 లక్షల చొప్పున మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అనుకోని అతిథి ఇంటి ముందుకు వచ్చి ఇల్లు మంజూరు చేయడంతో లబ్ధిదారులు ఆవుల అంజయ్య, ఆవుల లింగయ్య మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

హాలియా : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. హాలియా, చిట్యాల మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కుపాషిపల్లి గ్రామానికి చెందిన ఎస్‌కె ఉస్మాన్(23) రోజువారి కూలీ పని నిమిత్తం ఉదయం 5.30 గంటల సమయంలో తన ఇంటి నుంచి బైక్‌పై నల్లగొండకు వెళ్తున్నాడు. ఇదే సమయంలో పులిమామిడి నుంచి ఇసుకను తరలిస్తూ కుమ్మరికుంట (కేకే కాలువ) వైపు అతివేగంగా వెళ్తున్న ట్రాక్టర్ మారేపల్లి గ్రామ శివారులోని ఉస్మాన్ ప్రయాణించే బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఎస్‌కె ఉస్మాన్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం సాగర్ కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఎస్‌కె ఇమాంబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు, బైక్ ఢీ..

చిట్యాల: చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన ఎదుళ్ల శేఖర్‌రెడ్డి(55) గ్రామ శివారులోని గాంధీ గుడి వద్ద గల వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు శేఖర్‌రెడ్డి ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా కారు నడుపుతున్న వ్యక్తి సైతం గాయపడ్డాడు. ప్రమాద ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదే విధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని రక్తికట్టించారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వేదమంత్రోచ్ఛరణాలతో వైభవంగా నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయడం లేదని..

- సహకార సంఘానికి తాళం వేసిన రైతులు


సహకార సంఘ కార్యాలయ గేటుకు రైతులు వేసిన తాళం

నడిగూడెం : మండల పరిధిలోని తెల్లబెల్లి సహకార సంఘంలో అర్హులకు రుణాలు మంజూరు చేయడం లేదని బుధవారం అదే గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆ సహకార సంఘం కార్యాలయానికి తాళం వేశారు. అనంతరం డీసీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సంబంధిత చైర్మన్, సీఈఓ దీర్ఘకాలిక రుణాలైన డైరీ రుణాలు మంజూరు చేయడంలేదని, 23 మందిలో 20 మందికి రుణాలు మంజూరు చేసి, మిగతా ముగ్గురికి మొండిచేయి చూపారని తెలిపారు. లంచం ఇస్తేనే రుణాలు మంజూరు చేస్తామంటున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. తమకు తక్షణమే రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని బాధితులు బడేటి లింగమ్మ, వీరబోయిన నాగమణి, బుర్రా సతీష్ ప్రభుత్వాన్ని కోరారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


అనాజిపురంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీడీ, ఎంపీపీ

పెన్‌పహాడ్ : రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ సుందరి కిరణ్‌కుమార్, ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్యలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని అనాజిపురం, సింగారెడ్డిపాలెం, దూపహాడ్, భక్తాళాపురం గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. పంటలకు మద్దతు ధర కల్పించి రైతులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చడానికే కొనుగోళు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ శేషగిరిరావు, మండల వ్యవసాయ అధికారి కృష్ణసందీప్, ఏపీఎం అజయ్ నాయక్, ఆర్‌ఐ స్వప్న, సర్పంచ్‌లు చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, షరీఫుద్దీన్, భిక్షం, ఎంపీటీసీ గద్దల నాగరాజు, ఏఈఓలు సంధ్య, గోపి, వెలుగు సీసీలు ఐతరాజు చెన్నయ్య, సైదులు, సంఘ బంధం సభ్యురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి


ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు

భువనగిరి : రాజ్యాంగంపై ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలని యాదాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, భువనగిరి న్యాయవాదుల సంయుక్త ఆధ్వర్యంలో ప్రజలకు రాజ్యాంగం- పౌరుల హక్కులు విధులు అంశంపై అవగాహన కల్పించేందుకు పట్టణంలోని జిల్లా కోర్టు నుంచి రాయగిరి ఎక్స్ రోడ్డు వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. హక్కుల సాధనతో పాటు విధుల నిర్వహణ బాధ్యతలను చేపట్టాలన్నారు. అంతకుముందు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య, జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, న్యాయవాదులు సంఘం అధ్యక్షుడు అంజయ్య, కార్యదర్శి రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, కేశవరెడ్డి, ట్రాఫిక్ సీఐ సతీష్,జితేందర్‌రెడ్డి, వెంకటేష్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్ ధమాకా



అడ్డగూడూరు : అడ్డగూడూరు మండలం మానాయికుంట గ్రామానికి చెందిన మార్తె సైదులు, నాగమ్మ దంపతులు సాకుతున్న ఆవు బుధవారం ఒకే ఈతలో రెండు లేగ దూడలకు జన్మనిచ్చింది. రెండు మగ దూడలు ఒకే రూపంతో ఉన్నాయి. ఇలాంటి ఘటనలు అరుదుగా జరుగుతాయని పశువైద్యులు, గోపాల మిత్ర తెలిపారు.

నేతలకు ప్రచార అస్త్రంగా ‘బలగం’

- పోటాపోటీగా గ్రామాల్లో సినిమా ప్రదర్శన
- ప్రజలకు గుర్తుండిపోయేలా నాయకుల ప్రయత్నాలు

మునుగోడు: కుటుంబ కథా చిత్రంగా తెరకెక్కిన బలగం సినిమా రాజకీయ పార్టీల నాయకులకు ప్రచార అస్త్రంగా మారింది. పేద, మధ్య తరగతి వర్గాల జీవన స్థితిగతులే ఇతివృత్తంగా చిత్రీకరించిన ఈ సినిమాను చూడాలనే కోరిక గ్రామాల్లోని ప్రతి ఒక్కరిలో మొదలైయింది. కానీ, గతంలో మాదిరిగా మండల కేంద్రాల్లో సినిమా థియేటర్లు లేకపోవడం, గ్రామాల నుంచి జిల్లా కేంద్రాలకు వచ్చి సినిమా చూసే ఆర్థిక స్థోమత లేని పేదలు ఎంతో మంది ఉన్నారు. వారందరికీ రాజకీయ నాయకులు సొంత డబ్బులు ఖర్చుచేసి గ్రామ ప్రధాన కూడలిలో రాత్రి సమయంలో సినిమా ప్రదర్శించి అందరికీ గుర్తుండిపోయేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

రూ.10 వేలతో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శన..

బలగం సినిమాను ప్రదర్శిస్తే గ్రామస్తులు తమను గుర్తుపెట్టుకుంటారని రాజకీయ పార్టీల నాయకులు రూ.10వేలు ఖర్చు చేసి ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శిస్తున్నారు. సాధరణంగా సినిమా థియేటర్‌లో ఒక్కరు సినిమా చూస్తే రూ.100 టికెట్ తీసుకొని చూడాల్సి ఉంటుంది. అదే సినిమా నాయకులు తమ గ్రామంలో ఉచితంగా పదర్శిస్తుడంటంతో కుటుంబ సభ్యులు అంతా వెళ్లి వీక్షిస్తున్నారు. ఆ సినిమా చూసేందుకు వచ్చిన ప్రజలందరికీ కుటుంబాలు కలిసి ఉండాలని సందేశాలు ఇచ్చి ప్రదర్శిస్తున్నారు. మునుగోడు మండల వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవి ఇప్పటికే దాదాపు 15కు పైగా గ్రామాల్లో సినిమాను ప్రదర్శించగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన చల్లమల్ల కృష్ణారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిలు పలు గ్రామాల్లో పదర్శింపజేశారు. వారితో పాటు మరికొందరు సంపన్న కుటుంబాల వ్యక్తులు చనిపోయినా వారి స్మారకార్థం గ్రామాల్లో బలగం సినిమాను ప్రదర్శిస్తున్నారు. ఏది ఏమైనా బలగం సినిమా రాజకీయ పార్టీ నాయకులకు ప్రచార ఆయుధంగా మారిందని గ్రామాల్లో చర్చ జరుగుతోంది.

నీలగిరిలో దొంగల హల్‌చల్

- తాళం వేసిన పలు ఇళ్లలో నలుగురు ముఠా సభ్యుల చొరబాటు
- సొత్తు లభించకపోవడంతో వెనుదిరిగిన వైనం
- ఇనుపరాడ్లు, ఆయుధాలతో సంచారం
- సీసీ ఫుటేజీల్లో రికార్డయిన కదలికలు

నల్లగొండ క్రైం : నీలగిరి పట్టణంలో బుధవారం తెల్లవారుజామున దుండగులు హల్‌చల్ సృష్టించారు. నలుగురు వ్యక్తులు గల ఓ ముఠా పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో ఆయుధాలతో సంచరించింది. లక్ష్మీనివాస్ అపార్ట్‌మెంట్‌లో జీ8 ఫ్లాట్, బృందావన్‌కాలనీ, విశ్వనాథ కాలనీల్లో తాళాలు వేసిన పలు నివాసాల్లోకి చొరబడి సోదాలు నిర్వహించారు. అయితే, ఆ ఇళ్లలో ఎలాంటి సొత్తు లభించకపోవడంతో నిరాశతో వెనుదిగారు. ఓ దొంగ అపార్ట్‌మెంట్ కింద ఉండగా ముగ్గురు వ్యక్తులు నివాసాల్లో చొరబడి సోదాలు నిర్వహించారు. ఈ దృశ్యాలు సీసీ ఫుటేజీల్లో రికార్డు అయ్యాయి. వాకింగ్ వెళ్లే వారు చూసి గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తున్నారని సమాచారం ఇవ్వడంతో అప్పటికే దొంగల ముఠా పారిపోయింది. పోలీసులు, సీసీ కెమరాల ఫుటేజీ, వేలు ముద్రలను సేకరించారు.అంతరాష్ట్ర దొంగల ముఠాగా భావిస్తున్నారు. లక్ష్మీనివాస్ అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు మేరెడ్డి యాదగిరిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వేమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

పోలీస్ పెట్రోలింగ్ పెంచాలి : ఎస్పీ

దొంగల ముఠా సంచారంపై పోలీస్ నిఘా పటిష్టం చేయాలని ఎస్పీ అపూర్వరావు అధికారులను ఆదేశించారు. దొంగతనాలు, దోపిడీలు జరగకుండా నిఘా వ్యవస్థతో పాటు పెట్రోలింగ్ చేయాలని యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దొంగల ముఠా కదలికలపై ఫోన్ లొకేషన్, సీసీ కెమరాల ఆధారంగా ఎటు వైపు వెళ్లారు? ఏ ప్రాంతానికి చెందిన వారో గుర్తించాలన్నారు. రైల్వేస్టేషన్, జాతీయ, రాష్ట్ర రహదారులు ఉన్న పోలీస్ అధికారులు మరింత నిఘా పెంచాలని సూచించినట్లు తెలిసింది.

ఎక్సైజ్ అధికారుల దాడులు

- నల్లబెల్లం, పటిక, సారా పట్టివేత
- ఐదుగురు సారా విక్రేతల అరెస్ట్


పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్: నియోజకవర్గంలో దాడులు నిర్వహించి నల్లబెల్లం, పటిక, సారా, వాహనాన్ని పట్టుకుని, ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గరిడేపల్లి, పాలకవీడు మండలాల్లో మంగళ, బుధ వారాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ చేసిన 630 కేజీల నల్లబె బెల్లం, 20 కేజీల పటిక, 35 లీటర్ల సారా, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కార్యాలయానికి తరలించినట్లు చెప్పారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతునున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎక్సై జ్ ఎస్‌ఐలు సతీష్ కుమార్‌రెడ్డి, వెంకన్న, సిబ్బంది నాగరాజు, రవి, నాగయ్య, ధనుంజయ పాల్గొన్నారు.

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

- నలుగురు కార్మికులకు స్వల్ప అస్వస్థత
- రూ.50లక్షల ఆస్తినష్టం


పెద్దకందుకూరు గ్రామంలోని పరిశ్రమలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది


యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలో బుధవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పరిశ్రమలోని డీసీ-1 బ్లాక్‌లో కార్మికులు మ్యాన్యువల్‌గా పనులు చేస్తుండగా ఈ మంటలు చెలరేగాయి. దీంతో ఆ బ్లాక్‌లో పనిచేస్తున్న నలుగురు కార్మికులు భయంతో బయటికి పరుగులు తీసారు. వెంటనే పరిశ్రమ నిర్వాహకులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేయగా వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ప్రాణ నష్టం జరగలేదని, నలుగురు కార్మికులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారని, రూ.50 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని పరిశ్రమ నిర్వాహకులు తెలిపారు. అస్వస్థతకు గురైన కార్మికులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా, టెంపరేచర్ ఎక్కువ కావడంతోనే ప్రమాదం జరిగిందని పలువురు కార్మికులు చెబుతుండగా, విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని కంపెనీ యాజమాన్యం పేర్కొంది.

నిప్పు అంటుకుని మొక్కలు దగ్ధం

మద్దిరాల : నిప్పు అంటుకుని మొక్కలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని 365 జాతీయ రహదారికి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పక్కనే ఉన్న జమాయిల్ మొక్కలకు అంటుకుని వ్యాపించాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో పలు మొక్కలు దగ్ధమైనట్లు తెలిపారు.

ధాన్యం నిల్వలో జాగ్రత్తలు తప్పనిసరి

- ..లేకుంటే పండించిన పంటలో 10నుంచి 20శాతం నష్టపోయే ప్రమాదం
- పెద్దవూర ఏఓ సందీప్


సందీప్, ఏఓ పెద్దవూర


ఆరబోసిన వడ్లు

పాడి పంట

పెద్దవూర : యాసంగి వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇంటికి వచ్చిన ధాన్యాన్ని ఎలా భద్రపర్చుకోవాలో తెలియక రైతులు తికమక పడుతుంటారు. ఆరుగాలం శ్రమించి అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేసి పండించిన ధాన్యాన్ని భద్రపరుచుకోవడం రైతులకు సవాలుగా మారింది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పండించిన పంటలో 10 నుంచి 20 శాతం నష్టపోయే ప్రమాదం లేకపోలేదని అంటున్నారు.. మండల వ్యవసాయ అధికారి సందీప్. ధాన్యం నిల్వ చేసుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన రైతులకు వివరిస్తున్నారు. ధాన్యం నూర్పిన తర్వాత ఇంటి అవసరాలు, విత్తనాలకు కలిపి సుమారు ఏడాదికి పైగా భద్రపరచాల్సి ఉంటుంది. దీంతో ధాన్యం రంగు, రుచి తగ్గుతుంది. సాధారణంగా వరికోతల సమయంలో ధాన్యంలో 20శాతం తేమ ఉంటుంది. గతంలో కూలీలచే వరి కోతలు కోపించేవారు. ప్రస్తుతం రైతులు కూలీలపై ఆధార పడకుండా యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. పంట పచ్చగా ఉన్నప్పుడే వరికోతలు కోస్తున్నారు. దీంతో ధాన్యంలో మరింత తేమ ఉంటే అవకాశాలు మెండుగా ఉంటాయి. ధాన్యాన్ని బాగా ఆరబెట్టి తేమ శాతం 14లోపు వచ్చేదాక చూసుకోవాల్సి ఉంటుంది. ధాన్యాన్ని నిల్వ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే కీటకాలు ఆశించి నష్టం కలుగచేస్తాయి. అంతే కాక ఎలుకలు ధాన్యాన్ని తినడమేకాక, వాటి విసర్జనలతో కలుషితమయ్యే ప్రమాదం ఉంది.

ఎలుకల నివారణకు చర్యలు

ధాన్యం గిడ్డంగి చుట్టూ చెత్త లేకుండా రోజూ శుభ్రం చేస్తుండాలి. వివిధ రకాలైన బోనులు, బుట్టలను ఉపయోగించి ఎలుకలను నిర్మూలించాలి. గిడ్డంగి తలుపుల కింది భాగాలకు జింక్ రేకులు అమర్చాలి. రంధ్రాలకు వైర్ మెస్ మూతలు అమర్చాలి. ఇటువంటి జాగ్రత్తలు పాటిస్తే ఎక్కువ రోజులు ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవచ్చు.

నిల్వ ఉంచిన ధాన్యాన్ని నష్టపరిచే కీటకాలు

ముక్క పురుగు : పంట కోయడానికి ముందు నుంచి ముక్క పురుగు నష్టం కలిగిస్తుంది. బియ్యంలో తెల్లని పురుగులుగా కనిపించేవి లార్వా దశలో ఉన్న ఈ పురుగులే. తల్లి కీటకం వడ్ల గింజకు చిన్న రంధ్రం చేసి అందులో గుడ్లు పెట్టి తన నోటి నుంచి వెలువడే కొవ్వు పదార్థంతో రంధ్రాన్ని మూసి వేస్తుంది. లార్వా ప్రౌఢ దశలోని ముక్క పురుగు గింజ లోపల బియ్యం తింటూ నష్టం కలిగిస్తుంది.

వడ్ల చిలుక : ధాన్యానికి వడ్ల చిలుక ఆశిస్తే ధాన్యం చెడు వాసన వస్తుంది. తల్లి కీటకం వడ్ల గింజలపై గుంపులుగా చేరి గుడ్లు పెడుతుంది. గుడ్లు పగిలి లార్వా గింజ లోపలికి తొలుచుకుని పోయి బియ్యపు గింజను తింటుంది. అనంతరం ప్యూపా దశ చేరక ముందే పైపొట్టులో చిన్న రంధ్రం చేస్తుంది. ప్రౌఢ దశకు చేరిన తరువాత ఆ రంధ్రం ద్వారా వడ్ల చిలుక బయటకు వస్తుంది. ఇది వడ్ల మూటలు, గిడ్డంగులపై కనిపిస్తుంది.

నుసి పురుగు

దీనినే పచ్చ పురుగు లేదా పెంకు పురుగు అంటారు. ఇది గొట్టపు ఆకారంలో చాలా చిన్నదిగా 3 మి.మీ పొడవు ఉంటుంది. ప్రౌఢ కీటకం ధాన్యం గింజలకు నష్టం కలిగిస్తుంది. ఇది ప్రారంభ దశలో చెత్తను, ఆ తరువాత గింజ పైపొరను, ఆ తర్వాత లోపలి బియ్యపు గింజను తిని తీవ్ర నష్టం కలిగిస్తుంది.

ధాన్యం నిల్వ చేసే పద్ధతి

రైతులు తక్కువ ధాన్యాన్ని వెదురు గాదెలు, సిమెంటు గాదెలు, లోహపు గాదెల ద్వార నిల్వ చేసుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలనుకుంటే గోదాములు లేదా గిడ్డంగులను సిమెంటు కాంక్రీటుతో నిర్మించుకుంటే పూర్తి రక్షణ ఉంటుంది. ముఖ్యంగా కీటకాలు, తేమ, వర్షం నీరు లోనికి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలుక కన్నాలు ఉంటే గాజు ముక్కలు, సిమెంటుతో పూడ్చి వేయాలి. ధాన్యం నిల్వలో కొత్త గోనె సంచులు ఉపయోగించాలి. గోనె సంచుల పైన, లోపల మలాథియాన్ లేదా ఎండో సల్ఫాన్ ద్రావణం స్ప్రే చేయాలి. మరునాడు సంచులను ఎండలో ఆరబెట్టాలి.